పైసల్ గోల్‌మాల్ ఐతే.!

బాధ్యత ఎవరిది.?

- కౌన్సిల్ తీర్మానం లేకుండానే విధుల్లోకి తీసుకున్న వైనం
- ఘట్‌కేసర్ మున్సిపల్ అకౌంట్స్ సెక్షన్‌లో విధులు
- 9 నెలలుగా వేతనం లేకుండానే పనిచేయడంపై అనుమానాలు

ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తి విధులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కార్యాలయంలోకి అకౌంట్స్ సెక్షన్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగి సేవలు కొనసాగుతుండటం పలు అనుమానాలకు దారితీస్తోంది. కౌన్సిల్ తీర్మానం లేకుండానే అకౌంట్స్ అసిస్టెంట్‌గా ఇమ్రాన్ అనే వ్యక్తి 9 నెలలుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అప్పటి నుంచి అతడు వేతనం కూడా తీసుకోకుండా పనిచేయడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. అతడిని గత కమిషనర్ నియమించినట్లు సమాచారం. అవుట్‌సోర్స్ ఉద్యోగులు ఉన్నప్పుడే నకిలీ ధ్రువపత్రాలు, గతేడాది రూ.3కోట్ల మున్సిపల్ నిధుల గోల్‌మాల్ జరిగాయి. కౌన్సిల్ తీర్మానం లేకుండానే ఓ ప్రైవేట్ వ్యక్తి సుమారు ఏడాదిగా ఎంతో ముఖ్యమైన అకౌంట్స్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇప్పుడు కూడా గతంలో జరిగినట్లు మున్సిపల్ నిధులు గోల్‌మాల్ అయితే ఏ అధికారి బాధ్యత వహిస్తారని స్థానిక నేతలు ప్రశ్నిస్తున్నారు.

గతేడాది రూ.3కోట్ల మున్సిపల్ నిధుల అవకతవకలు..

◆ గతేడాది ఓ అవుట్‌సోర్స్ ఉద్యోగి స్వార్థంతో మున్సిపల్‌కు పన్నుల రూపంలో వచ్చే నిధుల్లో సుమారు రూ.3కోట్లకు పైగా గోల్‌మాల్ జరిగింది. ఈ విషయమై ఇద్దరు కమిషనర్లకు మెమోలు జారీ అయ్యాయి. ఇద్దరు మేనేజర్లను సైతం విధుల నుంచి తొలగించారు. దీనిపై అప్పటి కమిషనర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు కూడా నమోదయ్యింది. వారం కిందట మున్సిపల్ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

మారని అధికారుల తీరు...

◆ ఘట్‌కేసర్ పంచాయతీగా ఉన్నప్పుడు నకిలీ బిల్లులు, డూప్లికేట్ మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యాయని విమర్శలు వచ్చాయి. ఈ విషయమై అప్పటి కలెక్టర్ స్పందించి ఐదు మంది బిల్‌కలెక్టర్లపై విచారణ జరిపించి నిజమని తేలడంతో వారిని విధుల నుంచి తొలగించారు. కాని అప్పటి ఓ మున్సిపల్ అధికారి వారికి అండగా నిలిచి కోర్టు వ్యవహారం నడిపించి మళ్లీ విధుల్లోకి తీసుకొచ్చారు. కోట్ల రూపాయల అవినీతి జరిగినా అధికారులు కళ్లు తెరువకపోవడం విడ్డూరంగా ఉందని మున్సిపాలిటీవాసులు అంటున్నారు. మొదటి నుంచి అధికారులు అవినీతి సిబ్బందిని వెనుకేసుకొస్తున్నారని బాహాటంగానే చెబుతున్నారు.



మున్సిపల్ కార్యాలయంలోని అకౌంట్స్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి



ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం

అవినీతి జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు.?

కౌన్సిల్ తీర్మానం లేకుండానే ఓ ప్రైవేటు ఉద్యోగికి అకౌంట్స్ కార్యాలయంలో విధులు అప్పగించారంటే అవినీతిలో అధికారుల పాత్ర ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చని మున్సిపాలిటీ ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ఓ ప్రైవేటు వ్యక్తి విధులు ఎలా నిర్వర్తిస్తాడని.. అందులో అవినీతి జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

కౌన్సిలర్ ఫిర్యాదుతో వెలుగులోకి...

◆ కౌన్సిల్ తీర్మానం లేకుండా మున్సిపల్ అకౌంట్స్ సెక్షన్‌లో ప్రైవేట్ వ్యక్తిని ఎలా నియమిస్తారని కౌన్సిలర్ బేతాల నర్సింగ్‌రావు కమిషనర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో పలు ఆరోపణలతో సస్పెండ్ అయిన వ్యక్తిని గత కమిషనర్ సాబేర్ అలీ ప్రత్యేక శ్రద్ధతో నియమించారని కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అధికారులే బాధ్యత వహించాలి..



అకౌంట్స్ ఆఫీస్‌లో పని చేసే వ్యక్తి నియామకంపై కౌన్సిల్ తీర్మానం లేదు. మున్సిపల్ అభివృద్ధికి ప్రధాన అంశమైన అకౌంట్స్‌కు ఎలా తీసుకున్నారో తెలియదు. మున్సిపాలిటీకి పన్నుల రూపంలో వచ్చే నిధుల్లో అవకతవకలు జరిగితే అధికారులే బాధ్యత వహించాలి.

– ఫిర్యాదు పత్రంతో కౌన్సిలర్ నర్సింగ్‌రావు

ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

డీఈఓ విజయకుమారి

సాక్షి,సిటీబ్యూరో: జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంతో సహా ఘట్‌కేసర్ మండలంలోని ఎదులాబాద్ అర్బన్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో రెండు సబార్డినెంట్, ఒక వాచ్‌మెన్ ఉద్యోగాలకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తామని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 7వ తేదీ వరకు మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బీసీ కమిషన్ పర్యటన వాయిదా

బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఇందిర

సాక్షి,సిటీబ్యూరో: ఈనెల 7న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ బీసీ కమిషన్ పర్యటన వాయిదా పడినట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఆర్.ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాలు, సంచార జాతులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజికవర్గాల నాయకులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు. బీసీ కమిషన్ తదుపరి పర్యటన వివరాలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



జంక్షన్ పనులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారంలో జరుగుతున్న జంక్షన్ అభివృద్ధి పనులను మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డితో కలిసి చైర్మన్ కొండల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ ఆయన మాట్లాడుతూ.. గోడలపై చిత్రాలు, పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటాలని చైర్మన్‌కు సూచించారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బద్దం కుమార్, కృష్ణ, జోగు మల్లేష్, దశరథ్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సదరోత్సాహం.!

ఘనంగా గుండ్లపోచంపల్లిలో మున్సిపాలిటీ సదర్ వేడుకలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో మున్సిపాలిటీలో సోమవారం రాత్రి యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ వేడుకలు ఘనంగా జరిగాయి. యాదవులు దున్నపోతులను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సదర్ వేడుకల్లో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని యాదవులను సత్కరించి వారి దున్నపోతులపై శాలువాలు కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా, కులమతాలకతీతంగా సదర్ వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. యాదవులకు పాడిపశువులే జీవనాధారమని వాటికి పూజలు చేసి ఊరేగించే సంప్రదాయం యాదవుల సొంతమన్నారు. మున్సిపాలిటీలో యాదవ భవన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రభాకర్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వర్, కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్, మల్లికార్జున్ ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కీసర: యాద్గార్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాయిపల్లి విద్యుత్ ఫీడర్ 11కేవీ మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 నిమిషాల వరకు తిమ్మాయిపల్లి, ధర్మారం, ఫారెస్ట్ రిడ్జ్, సైలెంట్ వాల్ట్, సర్సపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని, కీసర విద్యుత్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

మర్యాదపూర్వక భేటీ



కీసర: నాగారం కొత్త మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డిని మంగళవారం నాగారం మున్సిపల్ జేఏసీ నేతలు కలిసి సమస్యలను తెలియజేశారు. మున్సిపల్ పరిధిలోని లోతట్టు కాలనీలో చేపట్టాల్సిన వివిధ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని విన్నవించారు. ప్రధాన రహదారి గుండా వరదనీటి కాల్వ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



కీసర: మేడ్చల్ మల్కాజ్‌గిరి మత్స్యశాఖ కార్యాలయం సహకారంతో 21వేల చేపపిల్లలను మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తీగల నారాయణ చెరువులో వదిలారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని మత్స్యకారుల సంక్షేమానికి కృషిచేస్తున్నామన్నారు. మత్స్యశాఖ అధికారులు, దశరథగౌడ్ ఉప్పరి నర్సింహ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఏ, పీఆర్‌సీ సహా పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం పెండింగ్ డీఏలు, పీఆర్‌సీతో సహా పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని టీచర్లు ధర్మాగ్రహ దీక్ష నిర్వహించారు. దశలవారీగా టీచర్లు ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తోందని టీపీయూఎస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శాఖ పేర్కొంది. కలెక్టరేట్ వద్ద ఆందోళనా కార్యక్రమాన్ని చేపట్టిన టీచర్లు అనంతరం జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా నేతలు రమాదేవి, సురేందర్, గోపాల్, రమేష్ రాథోడ్, వెంకటేష్, సంగమేశ్, శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

జాతీయ సాధన సర్వేపై విద్యార్థులకు క్విజ్

పాఠశాలలను సందర్శించిన విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి మంగళవారం సందర్శించారు. ప్రతాపసింగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు చౌదరిగూడలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించి జాతీయ సాధన సర్వేపై విద్యార్థులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇచ్చిన సమాధానాలను ఆయన అభినందించారు. పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, టీచర్ మాడ్యూల్స్, బోధన, అభ్యాసన పద్ధతులపై టీచర్లతో చర్చించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, మండల విద్యాధికారి శ్రీధర్, అకడమిక్ మోనిటరింగ్ అధికారి రవీందర్, రాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తాం

కీసర: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి అన్నారు. తిరుమల గార్డెన్‌లో సర్వే చేయనున్న 14మంది సూపర్‌వైజర్లు, 141మంది ఎన్యూమరేటర్లకు మంగళవారం మాస్టర్ ట్రైనర్ తారశ్రీ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. సర్వే విధానంపై వివరించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

12 క్వింటాళ్ల రేషన బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో నిందితుడు భూక్య రాజేందర్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని విక్రయించడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఓటీ పోలీసులు ఓ రేషన్ షాపులో కొనుగోలు చేసిన 12 క్వింటాళ్ల బియ్యాన్ని (24 బ్యాగులు) యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం జగ్గయ్య తండాకు చెందిన భూక్య రాజేందర్ విక్రయించడానికి మంగళవారం ఉదయం తరలించే క్రమంలో అతడిని పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఓ రేషన్ షాపు భర్త బాలాజీ నగర్‌కు చెందిన అబ్దుల్ అజీజ్ (అన్నుబాయ్) బియ్యం విక్రయించారని తేలింది. దీంతో బియ్యం స్వాధీనం చేసుకొని నిందితులను ఘట్‌కేసర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బలగాని ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

15 ఏళ్లుగా వంగి ఉన్న వెన్నుపూసను సరిచేసిన వైద్యులు



శస్త్రచికిత్స చేసుకున్న మహిళతో స్పైన్ సర్జన్ శ్రీనివాస్

మేడ్చల్‌రూరల్: గత 15 ఏళ్లుగా వెన్నుపూస సమస్యతో బాధపడుతున్న మహిళకు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బలగాని స్పైన్ అండ్ ఆర్థో ఆస్పత్రి వైద్యులు విముక్తి కల్పించారు. వరంగల్ జిల్లాకు చెందిన రేణుక(35) 15 ఏళ్లుగా వంగిన వెన్నుతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నయం కాకపోవడంతో చివరకు బలగాని ఆస్పత్రిని సంప్రదించారు. చీఫ్ స్పైన్ సర్జన్ శ్రీనివాస్ బలగాని శస్త్రచికిత్సతో సమస్యను తొలగించవచ్చని బాధితురాలి కుటుంబీకులకు వివరించారు. శస్త్రచికిత్స అనంతరం రేణుక వంగి నడిచే ఇబ్బంది తొలగడంతో కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మేడ్చల్‌రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మన్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ గ్రామ పరిధిలోని ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డులో మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలికి చేరుకుని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వాహనం ఢీకొట్టడంతో మృతిచెందినట్లు గుర్తించారు. వెంటనే మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.



సైకిల్ పెట్రోలింగ్

మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ బొక్కోనిగూడలో ఇన్‌స్పెక్టర్ పరుశురాం, ఎస్సై నరసింహతో కలిసి సైబర్ క్రైం, డ్రగ్స్ నివారణ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు పంపిన లింకులకు స్పందించకూడదని, డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

– ఘట్‌కేసర్

కీసరలో గ్రామ కంఠం స్థలం సర్వే

కీసర: కీసరలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన గ్రామ కంఠం భూమిని మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కీసర ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గల గ్రామ కంఠం భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. గ్రామ కంఠం స్థలాన్ని భవిష్యత్‌లో ఆంజనేయస్వామి దేవాలయానికి ఉపయోగకరంగా ఉండే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. మాజీ వైస్ ఎంపీపీ జలాల్‌పురం సత్తిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, కాంగ్రెస్ కీసర గ్రామశాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్, నర్సింహాచారి, జూపల్లి అశోక్, బీజేపీ నేత నల్లవెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామ కంఠం స్థలానికి సంబంధించిన మ్యాప్‌ను చూపిస్తున్న గ్రామస్తులు

యువతి అదృశ్యం



రోషిణి గైక్వాడ్ (ఫైల్)

మేడ్చల్‌రూరల్: ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన మాధవ్ గైక్వాడ్ కుటుంబంతో కలిసి మేడ్చల్‌కు వలస వచ్చారు. కిష్టాపూర్‌లోని సుమో బిస్కెట్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తూ కంపెనీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. మాధవ్ గైక్వాడ్ కుమార్తె రోషిణి గైక్వాడ్(18) వారం క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మేడ్చల్ పోలీసులకు ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిబ్బంది పనితీరుతోనే ప్రత్యేక గుర్తింపు

జీడిమెట్ల: రాష్ట్రంలో ఉన్న అన్ని ఆర్టీసీ రీజియన్‌లలో సికింద్రాబాద్ రీజియన్ నెంబర్ వన్‌లో ఉండటానికి ఆయా డిపోల్లో పని చేసే సిబ్బందే కారణమని సికింద్రాబాద్ రీజియన్ మేనేజర్ ఖుష్‌రోషాఖాన్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ రీజియన్ ప్రగతి చక్ర త్రైమాసిక పురస్కారాల కార్యక్రమాన్ని జీడిమెట్ల డిపో డీఎం ఆంజనేయులు ఆధ్వర్యంలో డిపోలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో క్రమశిక్షణ కలిగిన వ్యక్తి ప్రతి పనిలోనూ రాణిస్తారని అన్నారు. సంస్థలో ఉత్తమ పని తీరును కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు పండుగ వాతావరణంలో అవార్డులను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్ఎం మెయింటెనెన్స్ సురేష్ చౌహాన్, హకీంపేట్ డీఎం బహుబూతి, మేడ్చల్ డీఎం సుధాకర్, కంటోన్మెంట్ డీఎం సుధాకర్‌రావు, ఉప్పల్ డీఎం శ్రీనివాస్, హెచ్‌సీయూ డీఎం మురళీధర్ రెడ్డి, కూకట్‌పల్లి డీఎం హరి, మియాపూర్ డీఎం వెంకటేష్, కుషాయిగూడ డీఎం మహేష్, రాణిగంజ్ డీఎం శ్రీధర్, చంగిచర్ల డీఎం కవితతో పాటు వివిధ డిపోల సీఐలు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీపై నమ్మకాన్ని కలిగించాలి

ప్రతి డ్రైవర్ రక్షణాత్మకమైన డ్రైవింగ్ చేసి ప్రజలకు ఆర్టీసీపై నమ్మకాన్ని కలిగించాలని కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్ఎం మెయింటెనెన్స్ కవిత అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 154 కొత్త బస్సులు పెరగగా.. ప్రమాదాల శాతం సగానికి సగంగా తగ్గిపోయిందని తెలిపారు.

23 మందికి ఉత్తమ అవార్డులు

సికింద్రాబాద్‌రీజియన్‌లోని వివిధ డిపోల్లో పని చేస్తున్న 23 మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు ఉత్తమ అవార్డులను అందజేశారు. అవార్డు తీసుకున్న వారిలో జీడిమెట్ల డిపోకు చెందిన ముగ్గురు డ్రైవర్లు, కండక్టర్, కుషాయిగూడకు డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, హెచ్‌సీయూ డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు, కూకట్‌పల్లి డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు, హకీంపేట్ డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, కంటోన్మెంట్ డిపోకు చెందిన ఇద్దరు కండక్టర్లు, ఉప్పల్ డిపోలో చేస్తున్న ఇద్దరు మెకానిల్‌లు, ఒక హెల్పర్‌కు అవార్డులు అందజేశారు.



ప్రగతిచక్ర అవార్డులు అందుకున్న డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు



కార్యక్రమానికి హాజరైన వివిధ డిపోలో సిబ్బంది